# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 31 । జనవరి । 2023




**హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే** 8లో

హామీలన్నింటిని సీఎం జగన్ నెరవేర్చారని ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ అన్నారు.



**తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు** 8లో

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పీవో గోపాలకృష్ణ ఆదేశించారు.



**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అరకులోయలో 13డిగ్రీలు, మినుములూరులో 10 డిగ్రీలు,చింతపల్లిలో 10డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## న్యూస్‌రీల్

### కొబ్బరి, ప్రసాదాల విక్రయానికి వేలం

**వచ్చేనెల 8వ తేదీన నిర్వహణ**

కూనవరం: మండలంలోని **శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి (కుమారస్వామిగుట్ట) వారి దేవస్థానం** ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18న **మహాశివరాత్రి** పర్వదినం పురస్కరించుకొని **కొబ్బరికాయలు,** లడ్డూ ప్రసాదాల విక్రయానికి **వేలంపాట నిర్వ**హించనున్నట్లు దేవస్థానం **కార్యనిర్వహణా**ధికారి జి.లక్ష్మీకుమార్ తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు కొబ్బరి కాయలు, ప్రసాదం విక్రయానికి సంబంధించి మర్రిగూడెం పంచాయతీ కార్యాలయంలో వచ్చేనెల 8వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కొబ్బరి కాయల విక్రయానికి రూ.5వేలు, లడ్డూ ప్రసాదాల విక్రయానికి రూ.5 వేల చొప్పున ధరావత్తు చెల్లించాలని ఈవో సూచించారు.

### అహింసా మార్గమే మహాత్ముని ఆయుధం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- గాంధీ చిత్రపటం వద్ద ఘన నివాళి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: అహింసా మార్గమే మహాత్ముడు గాంధీ ఆయుధమని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అన్నారు. సోమవారం ఆయన వర్ధంతిని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం సాధనకు అహింసా మార్గాన్ని ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వాళ్లపై పోరాటాలు చేశారన్నారు. అయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఐటీడీఏ ఏవో హేమలత, డీపీవో కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, ఐటీడీఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

- ధాన్యం రైతులు ఆందోళన చెందొద్దు
- పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్‌కుమార్

రాజవొమ్మంగి: రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతుల దగ్గర మిగిలి ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం 23 వేల టన్నులు కాగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 46 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4,384 మంది రైతుల నుంచి రూ.22.204 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని చెప్పారు. వీటి విలువ రూ.45.29 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది కొనుగోలు లక్ష్యం పూర్తయినప్పటికీ అడిషనల్ టారెగ్ కోరుతూ ప్రభుత్వానికి లేఖ పంపామని చెప్పారు. ఇంకా రైతుల నుంచి సుమారు 4 వేల టన్నుల ధాన్యం ఉండవచ్చన్న అంచనాతో ఉన్నామన్నారు. ఇప్పటివరకు 2,634 మంది రైతులకు రూ.25.60 కోట్ల మేర చెల్లింపులు జరిగాయని డీఎం తెలిపారు.

### విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు

**జిల్లా విద్యాశాఖాధికారి రమేష్**



గూడెంకొత్తవీధిలో ఆశ్రమ పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లావిద్యాశాఖాధికారి డాక్టర్ రమేష్ సూచించారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. వివిధ పాఠశాలలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. సిబ్బంది కొరత నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని ఆయన వివరించారు. ఈఏడాది పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖరరావు, హెచ్‌ఎం ముక్కలి గణేశ్వరరావు పాల్గొన్నారు.

# గిరిలో పరివర్తన

**ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. గంజాయి వల్ల కలిగే అనర్థాలను గుర్తించిన గిరిజనులు పూర్తిగా సాగుకు దూరమయ్యారు. ఒకప్పుడు వేలాది ఎకరాల్లో సాగయ్యే గంజాయి దాదాపుగా తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో ఆ భూములన్నీ నేడు ఉద్యానవన, వాణిజ్య పంటలతో కళకళలాడుతున్నాయి. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి.**

- గంజాయికి గిరిజనులు దూరం
- చైతన్యం నింపిన ఆపరేషన్ పరివర్తన
- ప్రత్యామ్నాయ పంటల సాగుతో మంచి ఆదాయం
- ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న గిరిజనులు
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

సాక్షి, పాడేరు: గంజాయి పంట వాసనతో ఒకప్పుడు మారుమూల గ్రామాలు గుప్పుమనేవి. అంతర్రాష్ట్ర గంజాయి ముఠాల కనుసన్నల్లో గిరిజనులు వేలాది ఎకరాల్లో సాగు చేసేవారు. తరలిస్తూ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడి జైలుపాలై భవిష్యత్తును నాశనం చేసుకునేవారు. గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలపై గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారి సహకారంతో పోలీసుల ఆధ్వర్యంలో ఆపరేషన్ పరివర్తనలో భాగంగా తోటలను ధ్వంసం చేసింది. ప్రత్యామ్నాయ పంటలను పోత్సహిస్తోంది.



పెదబయిలు మండలం లక్ష్మీపేట శివారులో గంజాయి తోటలు (ఫైల్)

**పెద్ద ఎత్తున నిర్మూలన**

గంజాయి సాగుకు పేరొందిన జి.మాడుగుల, చింతపల్లి, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో వేలాది ఎకరాల్లో గంజాయి సాగు అయ్యేది.అలాగే జీకేవీధి, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో 10 నుంచి 20 ఎకరాల్లోపు గంజాయి తోటలు సాగు చేసేవారు. సుమారు పది వేల ఎకరాల్లో గంజాయి తోటలు సాగవుతున్నట్టు గుర్తించారు. 2021లో ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అమలుజేశారు. దీనిలో భాగంగా పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పెద్ద ఎత్తున గంజాయి సాగు నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు.

### 7,515 ఎకరాల్లో ధ్వంసం

2021 అక్టోబర్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు 7,515.15 ఎకరాల్లో గంజాయి తోటలను పోలీసు బృందాలు ధ్వంసం చేశాయి. దీంతో ఒక్కసారిగా గంజాయి సాగుకు గిరిజనులు దూరమయ్యారు. 2022 అక్టోబర్ నుంచి మళ్లీ గంజాయి తోటల ధ్వంసానికి పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. వేలాది ఎకరాల్లో చేపట్టిన గంజాయి సాగు బాగా తగ్గుముఖం పట్టింది. శాటిలైట్ వ్యవస్థ, టెక్నాలజీ సహకారంతో 900 ఎకరాల్లో గంజాయి సాగును గుర్తించిన పోలీసుశాఖ ఇప్పటివరకు 800 ఎకరాల్లో ధ్వంసం చేసింది. మిగిలిన వంద ఎకరాలను ఫిబ్రవరిలో ధ్వంసం చేసేందుకు కార్యాచరణ రూపొందించింది.



జి.మాడుగుల మండలం మారుమూల ప్రాంతంలో ధ్వంసం చేస్తున్న గంజాయి తోటలు

**ప్రత్యామ్నాయం దిశగా..**

ఆపరేషన్ పరివర్తనలో భాగంగా 2021 అక్టోబర్ నుంచి పోలీసు యంత్రాంగం, ఎస్‌ఈబీలు 7515.15 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం చేశారు. వీటిలో 7,328 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు పోలీసు యంత్రాంగం ద్వారా గిరిజనులను ప్రభుత్వం ప్రోత్సహించింది. విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఇలా వాణిజ్య పంటల సాగుతో ఆర్థికంగా లాభపడ్డారు.



పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ పుటూరులో ప్రత్యామ్నాయంగా చేపట్టిన రాజ్మా సాగు

### మొక్కల పంపిణీ ఇలా..

కాఫీపంటకు నీడనిచ్చేందుకు 823.05 ఎకరాల్లో 4,64,370 సిల్వర్‌ఓక్, 67 ఎకరాలకు 6940 నిమ్మ, 25ఎకరాల్లో 1900 జీడిమామిడి, 31ఎకరాల్లో 3,380 కమలా, 6 ఎకరాల్లో 360 కొబ్బరి, నాలుగు ఎకరాల్లో 160 చింత మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటిని గిరి రైతులు శ్రద్ధగా నాటుకొని సంరక్షణ చేపట్టారు.

**వాణిజ్య పంటలకు:** వాణిజ్య పంటలకు సంబంధించి గతేడాది 4,943 ఎకరాల్లో రాజ్మా సాగు చేపట్టేందుకు 65.95 కిలోల విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటితోపాటు 171ఎకరాలకు అవసరమైన 2237 కిలోల రెడ్‌గ్రామ్, 124 ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు 2025 కిలోల విత్తనాలు, 369 ఎకరాల్లో వేరుశనగ సాగుకు 5220 కిలోల విత్తనాలను పోలీసు శాఖ పోత్సాహంతో ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, కాఫీ విభాగాలు పంపిణీ చేశాయి. వీటితో సాగు చేపట్టిన రైతులు మంచి దిగుబడి సాధించి ఆదాయం పొందారు. ఇలా ప్రత్యామ్నాయ పంటలతో వారిని గంజాయి సాగుకు దూరం చేశాయి.

### వాణిజ్య పంటలకు సహకారం



మారుమూల గ్రామాల్లో గతంలో గంజాయి సాగు ఎక్కువగా ఉండేది. పోలీసుశాఖ పిలుపు మేరకు రెండేళ్ల నుంచి గంజాయి సాగుకు గిరిజనులు దూరమయ్యారు. జామిగుడ, కోరవంగి, బూసిపుట్టు, గిన్నెలకోట గిరిజనుల్లో చాలా మార్పు వచ్చింది. రాజ్మా, రాగులు, పసుపు తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. అందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

– **తెరవాడ వెంకటరావు,** గ్రామపెద్ద, జామిగుడ, పెదబయలు మండలం

### పూర్తిగా నిర్మూలిస్తాం



శాటిలైట్ వ్యవస్థ ద్వారా అత్యంత మారుమూల ప్రాంతాల్లో సుమారు 900 ఎకరాల్లో గంజాయి సాగును గుర్తించాం. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు తమ పోలీసుపార్టీలు, ఎస్‌ఈబీలు 800 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశాయి. గిరిజనులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నాం.వాణిజ్య పంటల సాగుతో మంచి లాభాలు పొందుతున్నారు. వచ్చే ఏడాదికి గంజాయి సాగు పూర్తిగా నిర్మూలిస్తాం.

– **సతీష్‌కుమార్,** ఎస్పీ, పాడేరు

# పేదలకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారులకు జగనన్న చేదోడు చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎంపీపీ రత్నకుమారి

- ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జగనన్న చేదోడు సాయం జమ
- 2,990 మందికి రూ.2.99 కోట్ల మేర లబ్ధి

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జగనన్న చేదోడు పథకంలో మూడవ ఏడాది ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వీడియో సమావేశం ద్వారా ప్రారంభించారు. రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నగదు జమచేశారు. అనంతరం సీఎం ప్రసంగాన్ని కలెక్టర్‌తో పాటు, పాడేరు ఎంపీపీ ఎస్.రత్నకుమారి, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లాకు సంబంధించి లబ్ధిదారులకు రూ.2.99 కోట్ల చెక్కును కలెక్టర్, ఎంపీపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకంలో జిల్లాలోని అర్హులైన 2,990 మంది లబ్ధిదారులకు రూ.2.99 కోట్ల ఆర్థిక సాయం అందుతుందన్నారు. రజకులు 383 మంది, నాయీబ్రాహ్మణులు 252 మంది, 2,355 మంది దర్జీలకు ఆర్థిక సాయం అందడం సంతోషంగా ఉందన్నారు. ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులంతా తమ షాపులకు పెట్టుబడులు పెట్టుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రతి ఏడాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం పంపిణీ చేస్తుండడం తమకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తమ దుకాణాల అభివృద్ధికి పెట్టుబడి రూపంలో సహకారం లభించిందని పేర్కొన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం అనేక పథకాలను అమలుజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి తమకు కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, బీసీ కార్పొరేషన్ ఏఈవో శంకరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, లబ్ధిదారులు

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి

- సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- సెకెండ్ ఇన్ కమాండెంటు సురేష్‌బాబు
- సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో సేవా కార్యక్రమాలు



ఆదివాసీలకు రగ్గులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, సీఆర్పీఎఫ్ అధికారులు

వై.రామవరం: మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సీఆర్‌పీఎఫ్ డి 42 బెటాలియన్ పోలీసులు చేపట్టిన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సెకెండ్ ఇన్ కమాండెంటు సురేష్‌బాబు అన్నారు. 42 బెటాలియన్ కమాండెంటు సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్ వద్ద సోమవారం డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎంఎల్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడ్డతీగల సీఐ వై.రాంబాబు, స్థానిక ఎస్‌ఐ ఎం. సంతోష్‌కుమార్, బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, సీహెచ్‌సీ సూపరింటెండెంటు ఎం. గౌతమి, వైద్యాధికారి రాహుల్ గౌరవ అతిథులుగా, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ పల్లాల వెంకటరమణారెడ్డి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, మంచినీళ్ల నారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధిలో సిఆర్‌పిఎఫ్ పోలీసులు బస్సు షెల్టర్లు, తాగునీటి సదుపాయం, లోతట్టు గ్రామాల్లో ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించారన్నారు. అంతేకాకుండా సోలార్ దీపాలు, వ్యవసాయ పరికరాలు, రగ్గులు, దుస్తులు, దుప్పట్లు, కుట్టు మెషీన్లు, వికలాంగులకు వీల్‌చైర్లు, విద్యార్థినులకు సైకిళ్లు, యువతకు వాలీబాల్, క్రికెట్‌కిట్లు ఉచితంగా అందించారని పేర్కొన్నారు. అడ్డతీగల సీఐ రాంబాబు మాట్లాడుతూ ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు కలిగి ఉండేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అసంఘటిత శక్తులకు సహకరించవద్దని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కువ కూలి సొమ్ముకు ఆశపడి, గంజాయి, సారా అక్రమ రవాణాకు సహకరించి జైలు పాలు కావొద్దని హితవు పలికారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

యార్లగడ్డ, వై.రామవరం ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరికి మాజీ ఎంపీపీ నగదు బహుమతి అందజేశారు. ముఖ్య అతిథుల చేతులమీదుగా వృద్ధులకు, పేదవారికి రగ్గులు, దుస్తులు, వాటర్‌డ్రమ్ములు సీఆర్‌పీఎఫ్ పోలీసులు అందజేశారు. సీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటుచేశారు. పోలీసు అధికారులే స్వయంగా పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పీయూటీ మల్లేశ్వరరావు, సీఆర్‌పీఎఫ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వై.రామవరంలో రగ్గులు, వాటర్ డ్రమ్ములు పంపిణీ చేస్తున్న కమాండెంటు సురేష్‌బాబు



వై.రామవరంలో పేదలకు భోజనాలు వడ్డిస్తున్న సీఆర్పీఎఫ్, పోలీసు అధికారులు

**మత్తుకు బానిస కావొద్దు**

చింతూరు: యువత మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండెంట్ సెంథిల్‌కుమార్ సూచించారు. సీఆర్పీఎఫ్ ఈ–42 బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సివిక్ యాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాల ప్రజల అవసరాలను గుర్తించి వారికి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్ మాట్లాడుతూ గంజాయి, సారాకు దూరంగా ఉండాలని, అంసాఘిక శక్తుల జోలికి పోకుండా గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఈ సందర్భంగా వీరాపురం, ఏజీ కొడేరు, కొత్తూరు, వెంకట్రామాపురం గ్రామాలకు చెందిన ఆదివాసీలకు రగ్గులు, నీళ్ల డ్రమ్ములను పంపిణీ చేశారు. సీఐ అప్పలనాయుడు, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన సమస్యలు సత్వర పరిష్కారం

**జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్**

రంపచోడవరం: స్పందనలో అందిన వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సల్, ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి ఆయన 72 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ జి. డేవిడ్ రాజ్. ఎండీ యూసఫ్, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, వైద్యాధికారి కల్పన, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి గోపిక, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు. డీఎంవో రామకృష్ణ, సీడీపీవో సంధ్యారాణి, డీఈ రంగనాథ్. ఎ.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రాజేంద్ర బాబు, పీహెచ్‌వో రాంబాబు, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, ఎంపీడీవో ఎంపీ ఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం ఐటీడీఏ స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జెసీ, పీవో, సబ్ కలెక్టర్లు

**అర్జీల్లో కొన్ని..**

- రంపచోడవరం మండలం రంప గ్రామం నుంచి మారేడుమిల్లి మండలం తాడేపల్లి వరకు రోడ్డు మెరుగుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అందాల సోమిరెడ్డి, ఎంపీటీసీ తుంబుడు లత కోరారు.
- వై.రామవరం మండలం ఎగువ ప్రాంతములోని బొడ్డగండి పంచాయతీ పరిధి పాలగెడ్డ నుంచి బొడ్డగండి వరకు రోడ్డును అభివృద్ధి ఏయాలని వినతి పత్రం అందజేశారు.
- ప్రధాన మంత్రి ఆదర్శ యోజన పథకంలో ఎంపికైన మంగంపాడు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గ్రామానికి చెందిన సరంకోట అబ్బాయి రెడ్డి అర్జీ అందజేశారు. అంతేకాకుండా కొండపోడు వ్యవసాయం చేసుకున్న 58 మందికి పట్టాలను అందజేయాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు.
- రంపచోడవరం మండలం బారంగిలో భూమి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కంగాల చెల్లయమ్మ, కంగల బాపిరాజు,కంగాల జోగమ్మ కోరారు.
- అడ్డతీగల మండలంలోని రాయిగూడెంలో సర్వే నంబర్ 21/4, 26/2.81లోని భూసమస్యలు పరిష్కరించాలని ముర్రం గంగన్నదొర, ముర్రం రాంబాబు వినతిపత్రం ఇచ్చారు.
- రంపచోడవరం మండలంలోని ఆకూరు,వేములకొండ, తున్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నేషనల్ పార్క్‌కు సంబంధించిన హద్దులు గ్రామసభల ద్వారా తెలియజేయాలని సర్పంచ్ కొమరం పండుదొర, ఎంపీటీసీ నర్రా పాపారావు కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# ప్రసూతి మరణాల నివారణే లక్ష్యం

- మెరుగైన వైద్యసేవలతో అడ్డుకట్ట
- అంబులెన్స్‌ల డీజిల్ నిధులు రూ.5 వేలకు పెంపు
- అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: మెరుగైన వైద్య సేవలు అందించి ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రసూతి మరణాల పర్యవేక్షణ, స్పందన కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన ప్రసూతి మరణాలపై వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ఇళ్లకు వెళ్లి వైద్యం అందించాలని సూచించారు. మానవ తప్పిదం వల్ల మరణాలు సంభవించకూడదని, వైద్యాధికారులు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలపై ఆధారపడకూడదన్నారు. హైరిస్క్ గర్భిణులను పదిరోజుల ముందే బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు తరలించి సుఖ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా చేస్తున్న పాలు, ఇతర పోషకాహార పదార్థాల పంపిణీ వివరాలను ఆయన తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు కల్పించాలని ఆదేశించారు. ఆశా, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రుతు క్రమం ఆగిన తర్వాత సకాలంలో రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వెంటనే స్థానికంగా ఉండే పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం అందించాలన్నారు. సమావేశానికి హాజరుకాని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్య సుజాత, గుదలంవీధి అంగన్‌వాడీ కార్యకర్తకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. ఆస్పత్రి నిధులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. ప్రాథమికఆరోగ్య కేంద్రాల అంబులెన్స్‌లకు డీజిల్ నిధులను రూ.5 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## క్లుప్తంగా

### పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బుజ్జికి సంతలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సతీష్

గూడెంకొత్తవీధి: ఆర్వీనగర్ సంతలో గస్తీ విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎప్ పోలీసు సిబ్బందికి ఒక సెల్‌ఫోన్ దొరికింది. దాన్ని సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సతీష్ భద్రపరిచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. గూడెం గ్రామానికి చెందిన కలిదిండి బుజ్జికి చెందిన ఫోన్‌గా గుర్తించారు. అతడికి సమాచారం అందించి, స్టేషన్‌కు పిలిపించి ఫోన్‌ను అతనికి అందజేశారు. దీనిపై బుజ్జి పోలీసులు, సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### క్షయ, కుష్టు నివారణ కార్యక్రమాలకు సహకరించాలి

ప్రైవేట్ వైద్యులకు డీటీసీవో విశ్వేశ్వరనాయుడు ఆదేశాలు



ప్రైవేట్ వైద్యులతో సమావేశమైన డాక్టర్లు విశ్వేశ్వరనాయుడు, శివకుమార్

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో క్షయ, కుష్టు నివారణ కార్యక్రమాలను వైద్య ఆరోగ్యశాఖ పెద్ద ఎత్తున చేపడుతుందని, ప్రైవేట్ వైద్యులు కూడా సహకరించాలని, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లోని ప్రైవేట్ వైద్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రోగులకు క్షయ, కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేసి, తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ ఉన్నారు.

# అందంగా.. ఆకర్షణీయంగా

- ఆకట్టుకుంటున్న కాగితం పువ్వులు
- విద్యార్థినులకు ప్రశంసలు



విద్యార్థినులు తయారుచేసిన కాగితం పువ్వులు



స్టేజీపై డ్రాయింగ్ చార్జులతో తయారుచేసిన హిందీ అక్షరమాల తోరణాలు



కాగిత పూలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

అనంతగిరి: మండల కేంద్రంలోగల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు-1 పాఠశాల విద్యార్థినిలు చదువుతో పాటుగా సృజనాత్మకంగా ప్రయోగాలతో తమ కంటూ ప్రత్యేకస్థానాన్ని పదిలపరచుకుంటున్నారు. కాగితంతో పువ్వులను తయారుచేసి అబ్బురపరుస్తున్నారు. విద్యార్థినిల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయురాలు కూడ కృషి చేస్తున్నారు. మండల కేంద్రంలోని జరిగిన కార్యక్రమంలోని గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాల విద్యార్థినిలు హెచ్ఎం మల్లీశ్వరీ, సిబ్బంది ప్రోత్సహంతో కాగితంతో పువ్వులను తయారుచేశారు. పువ్వులకు రంగులు వేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో పాటు హిందీ అక్షర మాలను సులభరీతిలో అర్థమయ్యే విధంగా డ్రాయింగ్ చార్టులను తయారుచేశారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులున్నారు. 17 మంది వరకు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ఉపాధ్యాయులు ప్రొత్సహిస్తుండడంతో పాటు మంచి గుర్తింపు వస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న పాఠశాల హెచ్ఎం మల్లీశ్వరీని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అభినందించారు. పాఠశాలలో ఇటీవల ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలోని పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విదార్థినులు తయారు చేసిన కాగితం పువ్వులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థినులను అభినందించారు.

### లక్ష్య సాధనతో ముందుకు సాగాలి



విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయి. విద్యార్థినిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలలోని తోటి ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో విద్యార్థినిలు ప్రతిభను కనబరుస్తున్నారు.

– మల్లీశ్వరీ, హెచ్ఎం, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-1, అనంతగిరి

# హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

- అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- గోస్తని నదిపై రూ.2 కోట్లతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- ఘన స్వాగతం పలికిన సారవానిపాలెం గ్రామస్తులు



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

అనంతగిరి: గిరిజన గ్రామాల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ సారవానిపాలెం గ్రామ సమీపంలోని గోస్తనీ నదిపై ఎస్‌సీపీ గ్రాంటు రూ.2 కోట్లతో చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణితో కలిసి శంకుస్థాపన చేశారు. వారికి సారవానిపాలెం గ్రామస్తులు గిరిజన సంప్రదాయం నడుమ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోని ఎంపీగా సేవలందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. గ్రామాల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం వల్ల గిరిజన గ్రామాలు అభివృద్ధిపథంలో పయనిస్తున్నాయన్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల అభివృద్ధి చేసేందుకు, తనవంతు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

**హామీ నెరవేరడంతో ఎంతో సంతోషం: పాల్గుణ**

ఇచ్చిన హామీ నెరవేరడంతో ఎంతో సంతోషంగా ఉందని అరకు ఎమ్మెల్యే పాల్గుణ అన్నారు. గత నాలుగు నెలల క్రితం సారవానిపాలెం గ్రామంలో పర్యటించినప్పుడు గెడ్డను దాటుకుంటూ వెళ్లానన్నారు. ఆ సమయంలో గ్రామస్తుల ఇబ్బందులను కళ్లారా చూసి, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చానన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అరకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్యలు తమ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు.

**చేతల ప్రభుత్వం:** ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. అర్హతగల ప్రతి కుటుంబానికి మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరీ, ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్‌లు లక్ష్మి, అప్పారావు, సీతయ్య, ఎంపీటీసీలు సన్యాసిరావు, మితుల, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఆదేశం



సమావేశానికి హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు

పాడేరు రూరల్: ఏజెన్సీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి, మార్చిలో తాగునీటి సస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయి, గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల మరమ్మతులకు మెకానిక్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బోరు, బావుల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలపైనే ఉందన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మండల స్థాయి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రామ సచివాలయ పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తాగునీటి పథకాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బోర్లు, బావుల వద్ద మహిళలు దుస్తులు ఉతకకుండా స్థానిక సర్పంచ్‌లతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. తాగునీటి పథకాలను శుభ్రం చేయడమే కాకుండా, తప్పనిసరిగా క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. మరమ్మతులకు గురైన సోలార్, గ్రావెటీ పథకాలు, బోర్లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్‌లో మంజూరైన పథకాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, డీపీవో కొండలరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్, 11 మండలాల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాల సాగుకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని వీటి సాగును విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు అన్నారు. లక్కవరపుపేట ఆర్‌బీకే పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో సోమవారం చిరుధాన్యాల సాగుపై గిరిజన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు ఎప్పటినుంచో అమల్లో ఉన్నా, దీన్ని వాణిజ్య ప్రాధాన్యం ఉన్న పంటగా గుర్తించి సాగు విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలని ఆయన సూచించారు. చిరు ధాన్యాల సాగుతో లాభాలు పొందవచ్చన్నారు. ఏడీ కార్యాలయ వ్యవసాయాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రైతులు అవకాశాలు వినియోగించుకోవాలి**

చింతపల్లిరూరల్: గిరిజన రైతులు ప్రభుత్వ ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కన్నబాబు అన్నారు. మండల కేంద్రంలో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. చిరు ధాన్యాల సాగుతో గిరిజనులు మంచి లాభాలు సాధించవచ్చని సూచించారు. చిరుధాన్యాల సాగులో మెలకువలను వివరించారు. శాస్త్రవేత్త శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టవర్ల ఏర్పాటుతో సమాచార వ్యవస్థ బలోపేతం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సింగవరంలోని జియోటవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

అనంతగిరి: మారుమూల గ్రామాల్లో టవర్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ సింగవరంలో జియో టవర్ నిర్మాణానికి వారు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలోని అనేక గిరిజన గ్రామాల్లో సెల్‌టవర్ల లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు సమాచార వ్యవస్థ బలోపేతం కోసం కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విన్నవించినట్టు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి జగనన్న స్పందించి శివారు ప్రాంతాల్లోనూ సెల్ టవర్లను మంజూరు చేశారన్నారు. దీంతో గిరిజనులకు పూర్తి స్థాయిలో సమాచార వ్యవస్థ అందుబాటులోకి వస్తోందని, ప్రభుత్వ సేవలను సులభతరంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అనుమతుల ప్రక్రియ వేగవంతం

- రోడ్ల నిర్మాణానికి వెనువెంటనే చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



అటవీ, ఇంజినీరింగ్‌శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని అటవీ అనుమతుల్లేక నిలిచిపోయిన పలు రోడ్లకు సంబంధించి వెనువెంటనే అనుమతులు వచ్చేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని అటవీ, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతగిరి మండలంలోని ఎన్‌ఆర్‌పురం-గాదిల్లోవ, గుమ్మకోట-గాలిపాడు మధ్యలోని 20 కిలో మీటర్ల మేర రోడ్డు పనులకు 17 కిలో మీటర్లకు అటవీ అనుమతులు అవసరమన్నారు. ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని ఈఈ లావణ్యకుమార్ ఆదేశించారు. అదేవిధంగా పుల్లకోట-పాముర్లై, సిరిబల నుంచి బొనంపల్లి మీదుగా కొత్తూరు రోడ్డుకు సంబంధించి సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణశాఖ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. చింతపల్లి నర్సీపట్నం, పాడేరు డివిజన్ల పరిధిలోని రోడ్లను ఆయా అటవీశాఖ అధికారులు పరిశీలించి, వారం రోజుల్లో అనుమతులు జారీ చేయాలన్నారు. అనంతగిరి, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో 15 రోడ్లు అభివృద్ధికి జాయింట్ పర్యవేక్షణ చేయాలని, ఫిబ్రవరి 10వ తేదీన జిల్లాస్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## రాష్ట్ర పీఆర్ ఇంజినీరింగ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

దేవరాపల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆయనను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో చేపట్టే నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘం ప్రతినిధులు వరప్రసాద్, సంగీతరావు, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# దీక్షా శిబిరం తొలగింపు



రిలే దీక్ష చేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని, విద్యార్థుల వరుస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలని, తదితర డిమాండ్లతో ఐటీడీఏ వద్ద గత 42రోజులుగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు చేస్తున్న రిలే దీక్షలను సోమవారం పోలీసులు భగ్నం చేశారు. రిలే దీక్ష శిబిరం ఏర్పాటుతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, 29న దీక్షలు ముగించాలని పాడేరు పోలీసులు రిలే దీక్షలు చేస్తున్న నాయకులకు నోటీసులు జారీ చేశారు. కానీ 30న యధావిధిగా చేపట్టారు. దీంతో పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐలు లక్ష్మణ్, రంజిత్‌లు దీక్ష శిబిరాన్ని తొలగించాలని సూచించినా నాయకులు పట్టించుకోలేదు. దీంతో పోలీసులు ఆయా నాయకులను అదుపు తీసుకోని వాహనాల్లో పాడేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీక్ష శిబిరాన్ని తొలగించారు. దీనిపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టారు.

# రాష్ట్ర స్థాయి మహిళా హాకీ విజేత అనకాపల్లి

- రన్నరప్‌గా కాకినాడ జట్టు
- బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజు



విజేత అనకాపల్లి హాకీ జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి: రాష్ట్ర స్థాయి మహిళా హాకీ పోటీల విజేతగా అనకాపల్లి జిల్లా జట్టు నిలిచింది. కాకినాడ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. రెండు సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు, అనకాపల్లి-కాకినాడ జట్ల మధ్య తుది పోరు ఉత్కంఠగా జరిగాయి. విజయం కోసం అనకాపల్లి, కాకినాడ క్రీడా జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. చివరకు అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించిన అనకాపల్లి జట్టు 3-0 గోల్స్ తేడాతో కాకినాడపై సునాయస విజయాన్ని సాధించింది. తృతీయ స్థానం అనంతపురం జిల్లాకు దక్కింది. మొత్తం 22 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు ఎగబడ్డారు. విజేత రన్నరప్ జట్లకు ఎమ్మెల్యే కన్నబాబురాజు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి హాకీకి పుట్టినిల్లుగా విరాజిల్లుతుందన్నారు. ఇక్కడ హాకీ క్రీడలో రాణించి జాతీయ జట్లకు ఎంపికై ఎందరో సీనియర్ క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారన్నారు. ఓడిపోయిన జట్లు ఎప్పుడూ నిరుత్సాహ పడకూడదని సూచించారు. ఓటమే గెలుపునకు తొలిమెట్టని, క్రీడల ద్వారా పోటీతత్వం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ రాజీవ్ క్రీడా మైదానంలో ఎన్నో రాష్ట్ర స్థాయి హాకీ మ్యాచ్‌లు జరిగాయన్నారు. యలమంచిలి హాకీ మైదానానికి రూపురేఖలు తన హయాంలోనే తీసుకువచ్చానని గుర్తు చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా హాకీ జట్టు మొట్ట మొదటిగా విజయం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులందరూ జాతీయ స్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ క్రీడను ఎక్కువగా యలమంచిలి ప్రాంతపు క్రీడాకారులే మక్కువ చూపి రాణిస్తున్నారన్నారు. జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ ఆడారి వీరునాయుడు, యలమంచిలి హాకీ అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, అగ్రెపు గుప్తా, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, సీఐ షేక్ గఫర్, ఎస్ఐ పాపినాయుడు, దాసరి మహేష్, యలమంచిలి హాకీ అసోసియేషన్ ప్రెసిడెంటు జి.వి. రెడ్డి, అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దాసరి గుప్తా, సాయి పాల్గొన్నారు.